క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. సాలార్‌జంగ్ మ్యూజియం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మరోసారి మొరాయించిన రాజాసింగ్ బుల్లెట్‌ప్రూఫ్ వాహనం

అబిడ్స్: గతంలో పలుమార్లు ట్రాఫిక్‌లో మొరాయించిన ఎమ్మెల్యే రాజాసింగ్ బుల్లెట్‌ప్రూఫ్ వాహనం మరోసారి మొరాయించింది. సోమవారం రాత్రి శంషాబాద్ నుంచి దూల్‌పేట్‌లోని ఎమ్మెల్యే రాజాసింగ్ తన ఇంటికి వెళ్తుండగా పురానాపూల్ చౌరస్తాలో ఆయన బుల్లెట్ ప్రూఫ్ వాహనం మొరాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. గతంలో పలుమార్లు తన బుల్లెట్ ప్రూఫ్ వాహనం మొరాయించినా కొత్త వాహనాన్ని ఇంత వరకూ ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు కొత్త వాహనాలు కేటాయించిన ప్రభుత్వం తనకు మాత్రం పాత వాహనాన్ని కేటాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కొండపోచమ్మకు బంగారు బోనం

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కొండ పోచమ్మ తల్లికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ తెలిపారు. పాతబస్తీ నుంచి అమ్మవారు భక్తులు కొండపోచమ్మ ఆలయానికి తరలి వెళ్లి బంగారు పాత్రలో అమ్మవారికి బోనం సమర్పించనున్నామన్నారు.

గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన కల్పిస్తాం



నియామకపత్రాన్ని అందుకుంటున్న సురేష్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర రైతాంగానికి గో ఆధారిత ఆర్గానిక్ పంట విధానంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని నమో మిషన్ వందే గోమాతరం జాతీయ అధ్యక్షుడు పెరిక సురేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వందే గోమాతరం జాతీయ అధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి వంటి వైద్య విద్యలో స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని వెల్లడించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అబిడ్స్ ఏసీపీ కడారి వెంకట్‌రెడ్డి తదితరులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ పరిసరాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను పోలీసులు తొలగించారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ కడారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బేగంబజార్ పోలీసులతో పాటు గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. అజంతా గేటు వద్ద, షాజహాన్ హోటల్ వద్ద సందర్శకులు ఎగ్జిబిషన్ లోపలికి సునాయసంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ..ఫుట్‌పాత్‌లను మళ్లీ ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎగ్జిబిషన్ సందర్శకులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేయాలి



గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో మూతలు లేక డ్రైనేజీలు పొంగిపొతున్నాయని కార్వాన్ కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఏఈ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కాళీమాత ఆలయం నుంచి జైన్ మందిర్ వరకు రోడ్డు పై ఉన్న మ్యాన్ హోళ్లకు మూతలు లేవని, ఈ కారణంగా డ్రైనేజీ రోడ్లపై పారుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కారణంగా ఈ రెండు ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులుపడుతున్నారని, వెంటనే మూతలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఆలే జితేంద్ర, కుమార్, రూప్‌రాజ్, సురేందర్ తదితరులు

చార్మినార్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను సోమవారం మొఘల్‌పురా డివిజన్‌లోని సుల్తాన్‌షాహీలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు రూప్‌రాజ్, సురేందర్, కుమార్, కరంజయ, పల్లేల లక్ష్మణ్, శ్రీనివాస్, పద్మా, శైలజా, రాఘవేంద్ర, జానకీరాం, నరేశ్ అవస్థి, రాకేశ్ తదితరులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఛత్రినాక చౌరస్తాలో సోమవారం చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి రాములు యాదవ్, హరీష్ యాదవ్ పాల్గొని చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయ్ కుమార్, భాస్కర్, శివ, నికాంత్, కిరణ్, సాయి కిరణ్ షిండే, మామిడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో..

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని నేతాజీ విగ్రహానికి నివాళులర్పించారు. శ్రీనివాస్, సుశీల్, బాలు, దత్తు, జైహింద్, నర్సింగ్ రావు, దశరత్, సతీష్ పాల్గొన్నారు.

నేతాజీ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి..

గన్‌ఫౌండ్రీ: నేటి యువత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో స్రవంతి సాంస్కృతిక వేదిక, ఏఐడీఎస్ఓ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేతాజీ 125వ జయంతి సంస్మరణ సమితి జాతీయ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు, సాహితీవేత్త రాప్రోలు సుదర్శన్, స్రవంతి సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. ప్రమీళ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవభారత్ నిర్మాణ్‌సంఘ్ ఆధ్వర్యంలో..

అబిడ్స్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు నవభారత్ నిర్మాణ్‌సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రముఖ సంఘసేవకుడు అమృత్‌కుమార్ జైన్, విద్యావేత్త సూరెపల్లి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో యువత పయనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు



నివాళులర్పిస్తున్న అమృత్‌కుమార్ జైన్, సూరెపల్లి రవికుమార్



ఛత్రినాకలో.. చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలి



ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ సునీత తదితరులు

గోల్కొండ: ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని హైదరాబాద్ జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీత అన్నారు. ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలు పాటించే విషయంపై ఆమె ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లాతో కలిసి ఆపరేషన్ థియేటర్‌తోపాటు ఆస్పత్రిలోని ఇతర విభాగాలను సందర్శించారు. ఇన్‌ఫెక్షన్ కంట్రోల్‌పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంతేకాకుండా ఆపరేషన థియేటర్ నిర్వహణపై కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆమె అన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్, ఏఓ డాక్టర్ ఏవీ శ్రీనివాస్, డాక్టర్ కవిత, రవి కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు చదువుతో పాటు ఇతర అంశాలపై కూడా అవగాహన పొందేలా తీర్చిదిద్దుతున్నామని లాల్‌దర్వాజా శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్ తెలిపారు. క్యాట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. విద్యార్థులు బాల్యం నుంచే చదువుతో పాటు ఆట, పాటల్లో కూడా రాణించాలన్నా రు. ఏజీఎం కృష్ణ, అకాడమీ కో ఆర్డినేటర్ రవి, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, డీన్ మల్లేష్, వైస్ ప్రిన్సి పాల్ ఆశా పట్నాయక్, ఏఓ రాజు, సీ-బ్యాచ్ ఇన్‌చార్జి జితేందర్, ఒలింపియాడ్ ఇన్‌చార్జి దాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని తలాబ్‌కట్టా, భవానీనగర్, జహంగీర్‌నగర్, మురాద్‌మహల్ అమాన్‌నగర్-బీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహంగీర్‌నగర్‌లో వరద నీటి సమస్యల పరిష్కారానికి నాలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిర్మాణ పనులను మరింత వేగంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. మొగల్‌పురా, పత్తర్‌గట్టి కార్పొరేటర్లు నస్రీన్ సుల్తానా, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ అలీఖాన్, మీర్ షోహెబ్ అలీ, జీహెచ్ఎంసీ ఏఈ మాజీద్ పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న అబ్దుల్ సత్తార్

అఫ్జల్‌గంజ్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంబీసీ జాతీయ అధ్యక్షుడు, దూదేకుల జాతీయ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ అన్నారు. సోమవారం అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ పద్మజా కుమారి, తెలుగు పండితులు డాక్టర్ ఎస్. విజయ్‌భాస్కర్, సీ హరిశంకర్, సీ శివశంకర్, అశోక్‌బాబు, సుచరితా, కౌసర్ ఫాతిమా, బబిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాతావరణ మార్పు, దిద్దుబాటుపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చేతన్ సోలంకి

గోల్కొండ: మన భవిష్యత్ తరాల స్థిరత్వం కోసం మనకు చాలా తక్కువ సమయం ఉందని ముంబై ఐఐటీ ప్రొఫెసర్ చేతన్ సోలంకి అన్నారు. వాతావరణ మార్పు, దిద్దుబాటు చర్యలపై అవగాహన సదస్సు షేక్‌పేట్ నారాయణమ్మ మహిళా ఇంజిరింగ్ కళాశాలలో సోమవారం జరిగింది. ఆరుషి ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి వ్యక్తిని అక్షరాస్యులుగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. దీని కోసం తాము ఇటీవల ఈఎస్ఓఆర్‌జీ పోర్టల్‌ని ప్రారంభించామన్నారు. వాతావరణ మార్పులపై పోరాటం చేయడంతో పాటు పరిష్కారాలను ప్రతిపాదించేందుకు తాను 11 ఏళ్లుగా తన ఇంటికి వెళ్లడం లేదన్నారు. తన బృందంతో కలిసి తాము రూపొందించిన సోలార్ బస్సులోనే ఉంటున్నానన్నారు. బొగ్గు, చమురు, గ్యాస్ వంటి కార్బన్ ఆధారిత ఇంధనాల వినియోగం ద్వారా ప్రపంచ శక్తి అవసరాలు 80 శాతం తీరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం తదితరులున్నారు.

మిథాని ఆర్టీసీ డిపోలో మొగిలయ్య సందడి



ఆటపాటలతో పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య

సంతోష్‌నగర్: మిథాని ఆర్టీసీ డిపోలో సోమవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య ప్రజల వద్దకు ఆర్టీసీ అనే నినాదంతో ముందుకు వచ్చి తన గాన మాధుర్యం.. వాక్ చాతుర్యం.. ఆట పాటలతో ప్రయాణికులను ఉత్తేజపరిచారు. మిథాని డిపోలో ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ గొప్పతనాన్ని ప్రజల వద్దకు ఆర్టీసీ సేవలు ఏ విధంగా చేరుతున్నాయో సిబ్బంది ఆహర్నిషలు ప్రయాణికుల కోసం ఏ విధంగా సేవ చేస్తున్నారనే తన గానంతో పాటలు పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో మిధాని డిపో డీఎం, ఎన్‌టీపీ, సూపర్‌వైజర్లు, ఈఎస్.రెడ్డి, మిథాని డిపో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

డబీర్‌పురా: ఆరోగ్యానికి హాని కలిగించే నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మీర్‌చౌక్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.50 వేలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహరాన్‌లో ఇమ్రాన్ గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సీసీఎఫ్ స్పెషల్ జోనల్ టీం దాడులు నిర్వహించి ఇమ్రాన్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.50 వేల విలువ చేసే 20 సిగరెట్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శం



కంటివెలుగులో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్

అబిడ్స్: కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శ పథకమని నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని మార్కెటింగ్ డైరెక్టర్ మాణిక్‌రావుతో కలిసి సందర్శించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ.. బస్తీలు, మురికివాడల ప్రజలకు కంటి వెలుగు పథకం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇంటివద్దకే వైద్యం వచ్చిందన్నారు. కంటి వెలుగులో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు ఉచితంగా ఇస్తున్నారని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్ధ నగ్నంగా నృత్యం చేయించిన వ్యక్తిపై కేసు

చాంద్రాయణగుట్ట: స్నేహితుడిని బట్టలు ఊడదీయించిన నృత్యం చేసిన ఘటనపై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాపూర్‌కు చెందిన అలీ బయిసా, మరో యువకుడు స్నేహితులు. మూడు నెలల క్రితం స్నేహితుడిని పిలిస్తే రాకపోవడంతో ఆగ్రహానికి గురైన బయిసా అధికంగా మద్యం తాగి కత్తితో స్నేహితుడిని బెదిరించి అసభ్యపదజాలంతో దూషిస్తూ అర్ధనగ్నంగా నృత్యం చేయిస్తూ వీడియో తీయించాడు. ఈ వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రౌడీషీటర్‌కు 15 రోజుల జైలు

సంతోష్‌నగర్: ఓ రౌడీషీటర్‌కు నాంపల్లి 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ షేక్ యూసుఫ్ (30) ఆస్తి తగాదాల విషయంలో నిందితుడు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

'కంటి వెలుగు'కు విశేష స్పందన



పురానాపూల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన హోంమంత్రి మహమూద్ అలీ

దూద్‌బౌలి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుందని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం ఆయన పురానాపూల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఎంతో మంది వృద్ధులు, మహిళలు సద్వినియోగం చేసుకొని కంటి అద్దాలు, ఆపరేషన్లు చేయించుకున్నారు. తెలంగాణ ప్రభు త్వం దేశంలో ఎక్కడ లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం కార్పొరేటర్ రాజ్‌మోహన్ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు మహమూద్ అలీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ బుష్రా, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



పాదయాత్ర నిర్వహిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలో రూ.15 కోట్ల నిధులతో చేయాల్సిన పలు అభివృద్ధి పనులను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం ప్రారంభించారు. మురుగునీటి పారుదల పైప్‌లైన్, తాగునీటి సరఫరా పైప్‌లైన్, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఆయన పత్తర్‌గట్టి, మొఘల్‌పురా, శాలిబండ తదితర మున్సిపల్ డివిజన్ల పరిధిలోని పలు బస్తీల్లో ప్రారంభించారు. నూర్‌ఖాన్‌బజార్ నుంచి సుల్తాన్‌షాహి వరకు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా ఆయన స్థానిక ప్రాంతాల ప్రజల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి బస్తీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో రాబోయే రోజుల్లో రూ.210 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగనున్నాయన్నారు. అంతేకాకుండా దారుషిఫా వరకు నిలిచిపోయిన మెట్రో పనులను సాధ్యమైనంత వెంటనే ప్రారంభించి పూర్తి చేసే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తామన్నారు. ఇప్పటికే నిధులు మంజూరైనప్పటికీ.. మెట్రో రైల్ ప్రాజెక్ట్ అధికారులు పనులు ప్రారంభించడం లేదన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి మేరకు సాలార్‌జంగ్ మ్యూజియం వద్ద మూసి నదిపై బ్రిడ్జి నిర్మించి చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించనున్నామన్నారు. మహబూబ్‌చౌక్, లాడ్‌బజార్, మీరాలంమండి, ఖిల్వత్, సర్దార్ మహల్ భవనం రెన్యువేషన్ తదితర అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ.రమణాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కలహంసి ఆర్ట్స్, కొమర్రాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి వడ్డేపల్లి కృష్ణ రచించిన ప్రపంచ విపంచి పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తెలుగు గజల్ ప్రక్రియ ఎంతో బాగుంటుందన్నారు. రచయిత వడ్డేపల్లి కృష్ణ అనేక విభాగాల్లో తనకలం విస్తరించం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, గజల్ కవయిత్రి గడ్డం శ్యామల, ఫౌండేషన్ అధ్యక్షులు కేవీ జ్ఞానకుమార్, రమాకాంత్‌రావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: భానోదయ సంఘంలో నూతన కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను సోమవారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బస్తీవాసులకు ఇచ్చిన హామీ మేరకు విశాలమైన ఆధునిక హంగులతో కూడిన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. జీహెచ్ఎంసీ రూ.18 లక్షల నిధులతో ఈ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భానోదయ సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీజేపీ నాయకుడు జగన్, అర్జున్‌రావు, జాలిగం చిరంజీవి, పండరీనాథ్, సుమన్‌కుమార్‌ముదిరాజ్, రఘుకాంత్, వెంకటేశ్, సాయి ప్రసాద్, జయ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో పాతబస్తీ బంగారు బోనం



బంగారు బోనంతో శివసత్తి నిషా క్రాంతి, గాజుల అంజయ్య, రాకేష్ తివారీ తదితరులు

చార్మినార్: కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాల్లో పాతబస్తీకి చెందిన భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం పాల్గొంది. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల అనంతరం వచ్చే కొమురవెల్లి జాతరలో పాల్గొని బంగారు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా కొమురవెల్లికి తరలివెళ్లిన భక్తులు అక్కడ ఆదివారం రాత్రి కొమురవెల్లి మల్లన్నకు వడి బియ్యం, పట్టువస్త్రాలు, బండారి(పసుపు) సమర్పించారు. అనంతరం శివసత్తి నిషా క్రాంతి బంగారు బోనాన్ని తలపై పెట్టుకుని భాజా భజంత్రీల నడుమ ఆకట్టుకునే రీతిలో నృత్యాలు చేస్తూ ఎల్లమ్మ తల్లికి పట్టు వస్త్రాలు, బంగారు పాత్రలోని బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు అనంతోజ్ హంసరాజ్, రాజేష్, కోటిరెడ్డి, శ్రీధర్, వెంకటేష, మనోజ్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



షీల్డ్‌లతో చైర్మన్ ఆంజనేయులు గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రహీంపురా ప్లే గ్రౌండ్‌లో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు వారు షీల్డ్‌లను అందజేసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర నలుమూలలా క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, గోవింద్‌రాఠీ, నగరీ లక్ష్మీనారాయణ్, కాటిగర్ శంకర్, శివరతన్, కుమార్, ప్రమోద్, అజయ్ చౌహాన్, అక్షయ్ చౌహాన్, విద్య, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆసక్తి గల రంగాల్లో రాణించాలి



యాకుత్‌పురా: బాలికలు ఆసక్తిగల రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్న సూచించారు. అంతర్జాతీయా బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని షాహీన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మొఘల్‌పురా ఉర్దుఘర్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మారిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణం విద్యార్థులు చదవాలన్నారు. షాహీన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జమీలా నిషాత్ మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు సామాజిక అంశలు, హక్కులు, వ్యక్తిగత భద్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలికల రక్షణ విభాగం అధికారులు శ్రీనివాస్, విజయ్ భాస్కర్, షాహీన్ సంస్థ సభ్యులు అర్చన, షాహెదాబేగం, సుల్తానా, అనిత, జాహిరా, బుష్రా, పూజ పాల్గొన్నారు.